

అధ్వానం.. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 2



3 పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



పథకాల అమలుకు ప్రాధాన్యం 2


www.aksharatoday.com

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND


## 'రైతుసభ' స్థలాన్ని పరిశీలించిన ఎంపీ

**అక్షరటుడే, ఇందూరు:** జాతీయ పసుపు బోర్డు కేంద్ర కార్యాలయ ప్రారంభానికి ఈనెల 29న అమిత్‌షా జిల్లా కేంద్రానికి రానున్నారు. అనంతరం పాలిటెక్నిక్ మైదానంలో రైతుసభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సభాస్థలిని బుధవారం ఎంపీ అర్వింద్, పసుపు బోర్డు ఛైర్మన్ పల్లె గంగారెడ్డి, ఎమ్మెల్యే ధన్‌పాల్ పరిశీలించారు. వారి వెంట ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి పరిశీలించారు.


25-6-2025 (WEDNESDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-3




మాట్లాడుతున్న గడ్డం చంద్రశేఖర్ రెడ్డి

## 'పార్టీ మారడంతోనే ఫోన్ ట్యాప్'

**అక్షరటుడే, కామారెడ్డి:** అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేస్తే కాంగ్రెస్ పార్టీ లోకి మారతానన్న సమాచారం తెలుసుకునేందు కు తనతో పాటు అనుచరుల ఫోన్ ట్యాప్ చేశార ని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని సిట్ కార్యాలయానికి విచారణకు హాజరయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సుమారు రెండు గంటల పాటు తన వివరణ తీసుకున్నారని తెలిపారు. తనతో పాటు పీఏ కరుణాకర్ రెడ్డి, డ్రైవర్ అశోక్, కాంగ్రెస్ నాయకులు అరవింద్ కుమార్ సిట్ ఎదుట హాజరైనట్లు చెప్పారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డిలోని తన ఇంట్లో పోలీసులు తరుచూ తనిఖీలు, దాడులు చేశారని పేర్కొన్నారు.

## రైతు భరోసా రూ. 306 కోట్లు జమ



**అక్షరటుడే, కామారెడ్డి:** రైతు భరోసా పథకం కింద జిల్లాలో ఇప్పటివరకు రూ.306.48 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ తెలిపారు. జిల్లాలోని 3,03,944 మంది రైతుల ఖాతాల్లో ఈ నిధులు జమ అయినట్లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో 32,237 మంది రైతులకు రూ.28.03 కోట్లు, జుక్కల్ నియోజకవర్గంలో 94,006 మంది రైతులకు రూ.106.55 కోట్లు, కామారెడ్డి నియోజకవర్గంలో 70,678 మంది రైతులకు రూ.65.54 కోట్లు, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో 1,07,023 మంది రైతులకు రూ.106.35 కోట్ల నిధులను రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు.





వర్షాల్లేక మొక్కజొన్న పంటకు మగ్‌లతో నీళ్లు పోస్తున్న రైతులు

# ముఖం చాటేసిన మేఘం..

రైతన్నకు కష్టాలు తప్పడం లేదు. ఓవైపు గిట్టుబాటు ధర కోసం ప్రభుత్వాలతో పోరాడుతున్న అన్నదాతకు వరుణుడు సైతం సహకరించడం లేదు. సకాలంలో వర్షాలు కూడా కురవకపోవడంతో కర్షకులు కన్నీళ్లు పెడుతున్నారు. మిరుగు నుంచి చుక్క చినుకు రాక రైతన్నలు ఆకాశం వైపు చూస్తూ వరుణ దేవుడా కరుణించు అని వేడుకుంటున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి

- విత్తనాలు నాటి ఎదురుచూస్తున్న అన్నదాతలు
- వర్షాల్లేక ట్యాంకర్లతో పంటకు నీరు
- ఆర్థికభారంతో రైతన్నల అవస్థలు

కామారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోలు పూర్తయిన తర్వాత ఖరీఫ్ పంట సాగుపై రైతులు బిజీగా ఉన్నారు. వర్షాకాలం కంటే ముందు జోరుగా కురిసిన వర్షాలకు ఈ యేడు నీటి కొరత లేదని, వర్షాలు సమృద్ధిగా పడతాయని ఆశతో దుక్కులు దున్ని అన్ని సిద్ధం చేసుకున్నారు. పంట సాగు చేసుకోవడానికి విత్తనాలు విత్తుకున్నారు. పలు చోట్ల వరినారు సైతం వేశారు. తీరా వర్షాలు పడే సమయానికి వరుణుడు ముఖం చాటేశాడు. మిరుగు తర్వాత కురావాల్సిన వర్షాలు ఇప్పటికి జాడ లేదు. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది.

### వెయ్యికళ్లతో ఎదురుచూపులు..

రబీలో అకాల వర్షాల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో అన్నదాతలు పంట చివరి వరకు కంటికి రెప్పలా కాపాడుకోవాల్సి వచ్చింది. కాగా.. ఈ సీజన్‌లో



రుతుపవనాలు ముందే వచ్చాయని భావించిన రైతులకు నిరాశే మిగులుతోంది. వర్షం ఎప్పుడు పడుతుందా.. ఎప్పుడు పంట మొలకెత్తుతుందా అని రైతన్నలు ఎదురుచూస్తున్నారు.

### ట్యాంకర్లతో నీటి సరఫరా

గత రబీలో సరైన సమయంలో పంటకు నీరందక ఎండిపోయే దశలో కొంతమంది రైతులు ట్యాంకర్ల ద్వారా పంటకు నీరు పారిస్తున్నారు. ప్రస్తుతం కూడా ఇదే పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఎండిపోతున్న మొక్కజొన్న పంటను కాపాడుకునేందుకు ట్యాంకర్ ద్వారా నీరు తెప్పించి నీటిని పంటలకు అందిస్తున్నారు. అసలే పంట పెట్టుబడికి ఇబ్బందులు పడ్డ తమకు ప్రస్తు తం ట్యాంకర్ ఖర్చు అదనపు భారంగా మారుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం పడితే తప్ప పంట గట్టెక్కే పరిస్థితి లేదని చెబుతున్నారు.

### ట్యాంకర్‌కు బాగా ఖర్చవుతోంది..



వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంట వేశాను. 15 రోజుల నుంచి చుక్క వర్షం లేదు. మొక్కజొన్న పంట మొత్తం ఎండిపోతుంది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని సరంపల్లి నుంచి ట్యాంకర్ ద్వారా నీటిని తెచ్చి పంటకు పారిస్తున్నాను. ట్యాంకర్‌కు రోజుకు రూ. 1,000 ఖర్చు అవుతుంది. వర్షం సకాలంలో పడితే అదనపు ఖర్చు భారం ఉండదు. - **ఆముదాల రమేష్, రైతు**



## టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్‌కు సన్మానం

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా ఇటీవల రాంభూపాల్‌ను నియమించారు. ఈ సందర్భంగా జిల్లా, నగర కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో కాంగ్రెస్ భవన్‌లో బుధవారం ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కేశవేణు, క్రమశిక్షణ కమిటీ సభ్యులు రామకృష్ణ, సీనియర్ నాయకులు నరాల రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. -అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్



## మాదక ద్రవ్యాల నియంత్రణకు ర్యాలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** మాదక ద్రవ్యాల నివారణ కోసం గురువారం నిర్వహించే ర్యాలీ పోస్టర్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ.. గురువారం ఉదయం 9:30 గంటలకు జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి నుంచి కళాభారతి వరకు ర్యాలీ నిర్వహిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి

## 'రాజ్యాంగ వ్యతిరేక పార్టీ కాంగ్రెస్'

**అక్షరటుడే, ఇందూరు:** కాంగ్రెస్ రాజ్యాంగ వ్యతిరేక పార్టీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి విమర్శించారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి నేటికి 50ఏళ్లు పూర్తయిందన్నారు. అందుకే బీజేపీ బ్లాక్‌డేగా పాటిస్తుందన్నారు. అనంతరం ఎమర్జెన్సీలో అరెస్టయిన జిల్లావాసులను సన్మానించారు.

**జిల్లాకు కిషన్‌రెడ్డి రాక..** ఎమర్జెన్సీ విధించి 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా బీజేపీ మూడు రోజు ల పాటు బ్లాక్‌డేని నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్ర అధ్యక్షు డు కిషన్‌రెడ్డి గురువారం జిల్లాకు వస్తున్నారన్నారు. సమావేశంలో నాయ కులు పోతన్‌కర్ లక్ష్మీ నారాయణ, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.



## అతిసార నియంత్రణపై చర్యలు చేపట్టాలి

**అక్షరటుడే, ఇందూరు:** అతిసార నియంత్రణపై అన్నిశాఖల సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ మేరకు జిల్లాస్థాయి టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చేతుల పరిశుభ్రత, ఓఆర్ఎస్ ద్రావణం తయారు చేసే విధానంపై కార్యకర్తలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి అశోక్, డీఆర్డీవో సాయాగౌడ్, డీడబ్ల్యూవో రసూల్‌బీ పాల్గొన్నారు.




## ఆర్మూర్ పట్టణంలో..

**అక్షరటుడే, ఆర్మూర్:** యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వరరెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం యాంటి డ్రగ్ అవగాహన కార్యక్ర మం నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సీఐ సత్య నారా యణ, సీడీపీవో భార్గవి, ప్రిన్సిపాల్ విజయానంద్, శ్రీదేవి, నళిని, వెంకటరమణ, షీటీం సభ్యులు సుమతి, విగ్నేష్ పాల్గొన్నారు.



## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మోపాల్ ఎస్సై యాద గౌడ్ సూచించారు. మోపాల్ మండలం కంజరలోని మహాత్మా జ్యోతిరావు పూలే పాఠశాలలో బుధవారం మత్తు పదా ర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ మురళి, ఏఎస్సై నాగభూషణం, పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాల నివారణకు కృషి చేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మాదకద్రవ్యాల నివారణకు సమష్టిగా కృషి చేయాలని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ రావు యువతకు పిలుపునిచ్చారు. జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని డ్రగ్స్ నియంత్రణపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల అలవాటుతో భవిష్యత్తును నాశనం చేస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐ రవీంద్ర నాయక్, ఎక్సైజ్ సీఐ షాకీర్, ఎస్సై బొజ్జ మహేష్, మున్సిపల్ కమిషనర్ మహేష్, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్ర మోహన్, ఎంఈవో రాజు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే ప్రధాన శాఖల్లో రిజిస్ట్రేషన్ల శాఖ ఒకటి. ఈ శాఖ ద్వారా దండిగా ఆదాయం వస్తున్నా కార్యాలయాలు అధ్వాన స్థితిలో ఉంటున్నాయి. ఎల్లారెడ్డి పట్టణంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఈ కోవకే చెందుతుంది. భవనం శిథిలావస్థకు చేరినా అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదని ప్రజలు పేర్కొంటున్నారు.

- అక్షరటుడే, లింగంపేట



ఎల్లారెడ్డి పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

# అధ్వానంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

**• ఆదాయం వస్తున్నా.. పట్టించుకునేవారు కరువు • కుంగిన టైల్స్.. పెచ్చులూడుతున్న గోడలు**

ఎల్లారెడ్డి పట్టణంలో 2016లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి రూ. 63 లక్షలు వెచ్చించి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. ఈ కార్యాలయం పరిధిలోకి లింగంపేట, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, గాంధారి మండలాల్లోని 83 గ్రామాల ప్రజలు భూలావాదేవీల నిమిత్తం వస్తుంటారు.

### తొమ్మిదేళ్లకే శిథిలావస్థకు..

భవనం నిర్మించిన తొమ్మిదేళ్లకు శిథిలావస్థకు చేరింది. ఈ భవనంలోని టైల్స్, ప్రహరీ, కిటికీల అద్దాలు పగిలిపోయి అధ్వానంగా తయారైంది. కార్యాలయానికి ప్రహరీ లేక పశువులు ఆవరణలోకి వస్తున్నాయి.




సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో పగిలిపోయిన టైల్స్

కార్యాలయంలోకి వచ్చే ప్రజలకు కనీసం మరుగుదొడ్లు, మూత్రశాలలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయం లోపల, బాల్కనీలో టైల్స్ పూర్తిగా పగిలిపోయి గాయాలయ్యాయని పలువురు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

### భవనం బాగోగులు చూసేవారు కరువు..

కాసులు కురిపిస్తున్న ఎల్లారెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం బాగోలు చూసే నాథుడు కరువయ్యాడని కార్యాలయానికి వచ్చే దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు.

నిత్యం మధ్యవర్తుల ద్వారా కాసులు దండుకుంటున్న అధికారులు కార్యాలయాన్ని పట్టించుకోక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కార్యాలయాన్ని బాగు చేయించాలని వారు కోరుతున్నారు.

## రాష్ట్రంలో కేడీలు, బేడీల పాలన



**అక్షరటుడే, ఆర్మూర్:** రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో అంతా కేడీలు, బేడీల పాలన కొనసాగుతోందని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. బుధవారం ఒక ప్రకటనలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది గోల్డెన్ పీరియడ్ అని సీఎం రేవంత్ రెడ్డి అనడాన్ని ఎద్దేవా చేశారు. రా ష్ట్రంలో కాంగ్రెస్ పాలన 50 ఏళ్ల నాటి చీకటి ఎమర్జెన్సీ పీరియడ్‌ను తలపిస్తోందని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పాలనలో ల్యాండ్, శాండ్, మైన్, వైన్ మాఫియాలు రాజ్యమేలు తున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలకు ఎగనామం పెట్టి ప్రజలను నిలువునా ముంచిన దగాకోరు పార్టీ విమర్శించారు. కేసీఆర్, ఆయన ఫ్యామిలీని తిట్టందే రేవంత్‌కు పూట గడవదన్నారు.

## పథకాల అమలుకు ప్రాధాన్యతనివ్వాలి



**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రభుత్వ పథకాల అమలు కోసం అధికారులు ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. భీమ్ గల్ మున్సిపాలిటీని ఆయన బుధవారం సందర్శించారు. పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న చర్యలపై అధికారులతో సమీక్ష జరిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక, మంజూరు ప్రక్రియల్లో జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు. మలేరియా నియంత్రణ విభాగం అధికారితుకారాం రాథోడ్, భీమ్‌గల్ మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తహశీల్దార్ షబ్బీర్ ఉన్నారు.

## సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభించాలని ధర్నా




**అక్షరటుడే, బిచ్కుంద:** మండల కేంద్రంలో అర్ధంతరంగా నిలిపేసిన సెంట్రల్ లైటింగ్ పనులు వెంటనే ప్రారంభించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శెట్టిపల్లి విష్ణు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బస్టాండ్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మద్నూర్ పిట్లం మండలంలో సెంట్రల్ లైటింగ్ పనులను త్వరలోనే ప్రారంభించాలని కోరారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు, జుక్కల్ మాజీ ఎమ్మెల్యే అరుణతార కామారెడ్డి జిల్లా జనరల్ సెక్రెటరీ రాము, బిచ్కుంద జనరల్ సెక్రటరీలు జాదవ్ పండరి, ముత్యం, పిరాజీ, మండల అధ్యక్షులు, జనరల్ సెక్రెటరీలు, బూత్ అధ్యక్షులు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు పాల్గొన్నారు.




## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలంలోని మచర్లలో సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సు, ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్మూర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రమేష్ మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. ప్రతి శుక్రవారాన్ని 'డ్రైడే'గా పాటిస్తూ, ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేగాం మెడికల్ ఆఫీసర్ అయేషా, సబ్ యూనిట్ ఆఫీసర్ సాయన్న పాల్గొన్నారు.

## గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని జీపీల్లో పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలని ఎంపీడీవో నరేష్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో శానిటేషన్ వరకు ఎప్పటికప్పుడు నిర్వహించాలని సూచించారు. సిబ్బంది గ్రామాల్లో అప్రమతంగా ఉండాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మలహరి, ఏపీవో కార్యదర్శులు పాల్గొన్నారు.

## తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** దోమకొండ మండలంలోని ముత్యంపేటలో బుధవారం మంచినీటి పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు చేపట్టారు. పైప్‌లైన్ పగిలిపోవడంతో ఎంపీడీవో కామారెడ్డి పరిస్థితిని సమీక్షించి దగ్గరుండి పనులు చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పైప్‌లైన్ల ఎక్కడా లీకేజీలు జరగకుండా చూసుకోవాలని జీపీ కార్యదర్శిని ఆయన ఆదేశించారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మణ పనులను పరిశీలించారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**అక్షరటుడే, ఆర్మూర్:** నందిపేట మండలంలోని పలు విద్యాసంస్థల్లో మత్తుపదార్థాలు, గంజాయితో దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. మండలంలోని ఉన్నత పాఠశాల, టీఎస్ మోడల్ స్కూల్, ఐలాపూర్ జూనియర్ కళాశాలల్లో బుధవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, పేయింటింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నందిపేట్ ఎస్సై చిరంజీవి, ప్రిన్సిపాల్ చిన్నయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో విలేకరులతో సమావేశం నిర్వహించారు. విద్యాసంస్థలు ప్రారంభమై 15రోజులు కావస్తున్నా సర్కారు బడుల్లో విద్యార్థులకు స్కూల్ డ్రెస్సులు అందజేయలేదని ఆరోపించారు. అనేక పాఠశాలల్లో టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వివరించారు. చాలావరకు భవనాలు శిథిలావస్థలో ఉండడంతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ చదువుతున్నారని వాపోయారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ కామారెడ్డి జిల్లా కన్వీనర్ శివప్రసాద్, ఎల్ సంపత్, సనత్, కుషాల్, రమేష్, శ్రీను పాల్గొన్నారు.



# గాంధారి ఉన్నత పాఠశాలలో అడ్మిషన్ల జోరు



**అక్షరటుడే, గాంధారి:** గాంధారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతున్నారు. బడిబాటలో భాగంగా నిర్వహించిన ఇంటింటి ప్రచారానికి విశేష స్పందన లభించింది. ఇప్పటివరకు 135 మంది విద్యార్థులు కొత్తగా అడ్మిషన్లు పొందినట్లు హెచ్ఎం రంగా వెంకటేష్ గౌడ్ తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, క్రమశిక్షణ, వైజ్ఞానిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆకర్షితులై తమ పిల్లలను చేర్పిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీహరి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శారద ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

## డిగ్రీ విద్యార్థులు కాలేజీల్లో రిపోర్ట్ చేయాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డిగ్రీలో ప్రవేశాలకు దోస్త్ ద్వారా సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలలో రిపోర్ట్ చేయాలని ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. దోస్త్ మొదటి, రెండో విడత కేటాయింపుల్లో సీట్లు పొంది, సెల్ఫ్ రిపోర్ట్ చేసిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లతో ఈ నెల 26 నుంచి 30 వరకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు. రిపోర్ట్ చేసిన వారికి మాత్రమే అడ్మిషన్ లభిస్తుందని, ఆన్‌లైన్ ద్వారా సెల్ఫ్ రిపోర్ట్ చేసిన విద్యార్థులు కళాశాలలో తమ సర్టిఫికెట్లను అందజేయాలన్నారు.

## విద్యాసామగ్రి పంపిణీ



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని బర్కత్‌పురా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఉదయ్ సుందర్ సేవాలాల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, పలకలు, పెన్నులు ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కృపాల్ సింగ్, ట్రస్ట్ ప్రతినిధులు రమేష్, శారద, సుధాకర్, ఉపాధ్యాయులు వింధ్య, సావిత్రి, హర్ష తదితరులు పాల్గొన్నారు.

## కోటగిరి బస్టాండ్‌పై నిర్లక్ష్యమేలా..?



**అక్షరటుడే, కోటగిరి:** మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రజలు, విద్యార్థులు, మహిళలు, ఇబ్బంది పడుతున్నారని సీపీఐ బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుబాస్ రాములు అన్నారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు దృష్టి పెట్టలేక పోతున్నారని అన్నారు. బస్టాండ్ లేక ప్రయాణికులు రోడ్ల వెంబడి ఎండలో నిల్చోలేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. మండల కార్యదర్శి ఏ విఠల్ గౌడ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దత్తత తీసుకున్న కోటగిరి గ్రామంలో బస్టాండ్ నిర్మించి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలని కోరారు. లేకుంటే బస్టాండ్ నిర్మించే వరకు ఉద్యమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నల్ల గంగాధర్, శంకర్, ప్రసాద్ తదితరులున్నారు.

## బెల్టు షాపుల కట్టడికి తీర్మానం



**అక్షరటుడే, బాన్సువాడ:** మండలం కోనాపూర్‌లో బెల్ట్ షాపులను కట్టడి చేయాలని గ్రామస్థులు తీర్మానం చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి భరత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ.. గ్రామంలో యువత మద్యానికి బానిస కాకుండా ఉండాలంటే బెల్ట్ షాపులను కట్టడి చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలో మద్యం అమ్మకాల నియంత్రణ కోసం ఎక్సైజ్ శాఖ అధికారులతో పాటు కలెక్టర్, పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



**అక్షరటుడే, ఆర్మూర్:** డొంకేశ్వర్ మండల కేంద్రంలో రైతు వేదిక వద్ద సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భూమేష్ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతుభరోసా ఇవ్వడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

**అక్షరటుడే, నిజాంసాగర్:** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సుమలత అన్నారు. బుధవారం నిజాంసాగర్ ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఎఫ్ఏలు, టీఏలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని, గ్రామ పంచాయతీలో వంద శాతం పన్నులు వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ ఏఈ గంగప్రసాద్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిపై పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో ఉపాధి హామీ ఏపీవో శివ, తదితరులు ఉన్నారు.



## బీజేపీ పట్టణ కార్యవర్గం ఎన్నిక

**అక్షరటుడే, కామారెడ్డి:** బీజేపీ జిల్లా కార్యాలయంలో బుధవారం కామారెడ్డి పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడు మోటూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకు న్నారు. పట్టణ ఉపాధ్యక్షులుగా చిన్నోళ్ల రజిని కాంత్, చిన్నోజి శ్రీనివాస్, గుణేందర్, గంగాధర్, ప్రవీణ్, విజయ్ పాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా రఘు, రాజగోపాల్, కార్యదర్శులు గా భూమేష్ యాదవ్, శ్రీనివాస్, రంజిత్, గురుమూర్తి, రాజు, గోవర్ధన్, కోశాధికారిగా మల్లేష్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఉప్పు లక్ష్మీపతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడుగా రాజేందర్, గిరిజన మోర్చా అధ్యక్షుడుగా వినోద్, బీజేవైఎం అధ్యక్షుడిగా బాలే భరత్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా బాలమని, కిషన్ మోర్చా అధ్యక్షుడిగా రాజు, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా లతీఫ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈ నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని, బీజేపీ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేస్తూ, పట్టణంలో పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలన్నారు.

